# 'మంత్రి' రేసులో ముగ్గురు..

- మినిస్టర్ పదవి కోసం యత్నాలు
- ముందు వరుసలో సీతక్క పేరు..
- పోటీలో దొంతి మాధవరెడ్డి, కొండా సురేఖ సైతం..
- ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశం

వరంగల్, డిసెంబర్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కొత్త మంత్రివర్గంలో ఉమ్మడి జిల్లా నుంచి చోటు ఎవరికి దక్కుతుందని ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది. ఉమ్మడి జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారు. ములుగులో ధనసరి అనసూయ(సీతక్క), వరంగల్ తూర్పులో కొండా సురేఖ, నర్సంపేటలో దొంతి మాధవరెడ్డి, పరకాలలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి, పాలకుర్తిలో మామిడాల యశస్విని, డోర్నకల్‌లో జాటోత్ రాంచంద్రునాయక్, మహబూబాబాద్‌లో భూక్య మురళీనాయక్, వరంగల్ పశ్చిమలో నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేటలో కె.ఆర్.నాగరాజు, భూపాలపల్లిలో గండ్ర సత్యనారాయణరావు విజయం సాధించారు. కొండా సురేఖ ఐదోసారి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి నాలుగోసారి, సీతక్క మూడోసారి, దొంతి మాధవరెడ్డి రెండోసారి ఎమ్మెల్యేలుగా గెలిచారు. గిరిజనుల్లో ముఖ్యంగా ఆదివాసీ మహిళా ఎమ్మెల్యేగా ములుగు ఎమ్మెల్యే సీతక్కకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు ఖాయమనే చర్చ కొనసాగుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీతక్కకు కీలక శాఖ దక్కుతుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. సీతక్కతోపాటు ఉమ్మడి జిల్లా నుంచి మరొకరికి మంత్రి పదవి దక్కుతుందని గెలిచిన ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. సీనియర్ ఎమ్మెల్యే కొండా సురేఖ, దొంతి మాధవరెడ్డిలో ఎవరో ఒకరికి మంత్రి పదవి వస్తుందని హస్తం పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. సామాజిక సమీకరణాల్లో భాగంగా బీసీల కోటాలో కొండా సురేఖ, ఉమ్మడి జిల్లాలో సీనియర్ ఎమ్మెల్యేగా దొంతి మాధవరెడ్డికి అవకాశాలు ఉంటాయని తెలుస్తున్నది. సీతక్క, కొండా సురేఖ, దొంతి మాధవరెడ్డిలో ఇద్దరికి మంత్రి పదవులు, మరొకరికి మరో కీలక పదవి దక్కుతుందని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో వరంగల్ ఉమ్మడి జిల్లాకు రెండు మంత్రి పదవులతోపాటు ఒక చీఫ్‌విప్ లేదా విప్ పదవి కేటాయించారు. తెలంగాణ రాష్ట్రంలోనూ ఉమ్మడి వరంగల్ జిల్లాకు మంత్రి పదవులు, ఇతర కీలక పదవుల పరంగా ప్రాతినిధ్యం పెరిగింది. 2014లో ముఖ్యమంత్రి కేసీఆర్ క్యాబినెట్‌లో ఉప ముఖ్యమంత్రిగా టీ రాజయ్య, మంత్రిగా అజ్మీరా చందులాల్ బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి జిల్లా నుంచి అసెంబ్లీ స్పీకర్‌గా సరికొండ మధుసూదనాచారికి అరుదైన అవకాశం దక్కింది. తర్వాత జరిగిన మార్పుల్లో టీ రాజయ్య స్థానంలో కడియం శ్రీహరికి ఉప ముఖ్యమంత్రిగా బీఆర్ఎస్ అవకాశం ఇచ్చింది. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి శాసనమండలిలో విప్‌గా పని చేశారు. 2018 ఎన్నికల తర్వాత ఇదే పరంపర కొనసాగింది. ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ మంత్రులుగా, దాస్యం వినయ్‌భాస్కర్ ప్రభుత్వ చీఫ్‌విప్‌గా పని చేశారు. వీరితోపాటు శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా బండా ప్రకాశ్, చీఫ్ విప్‌గా బోడకుంటి వెంకటేశ్వర్లుకు అవకాశాలు వచ్చాయి. తెలంగాణలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు మంత్రివర్గంలో, ఇతర కీలక పదవుల్లో ప్రాతినిధ్యం పెరుగుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఇదే పరంపర కొనసాగుతుందని కాంగ్రెస్ వర్గాలు ఆశిస్తున్నాయి. ఎప్పటిలాగే ఉమ్మడి జిల్లాకు రెండు మంత్రి పదవులతోపాటు మరో కీలక పదవి కచ్చితంగా దక్కుతుందని అధికార పార్టీ నాయకులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాజిక సమీకరణాల్లో భాగంగా మరికొందరికి వివిధ ప్రభుత్వ పదవులు దక్కుతాయనే అంచనాలు ఉన్నాయి.

**మరో ఇద్దరు..**

భూపాలపల్లి పరిధిలోని మంథని నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హనుమకొండ జిల్లాలో భాగంగా ఉన్న హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన పొన్నం ప్రభాకర్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కుతుందనే అంచనాలున్నాయి. దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 2009 నుంచి 2014 వరకు మంత్రిగా పని చేశారు. బ్రాహ్మణ సామాజికవర్గం నుంచి శ్రీధర్‌బాబు సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈ నేపథ్యంలో శ్రీధర్‌బాబుకు మరోసారి మంత్రి పదవి దక్కుతుందని తెలుస్తున్నది. బీసీల్లోని గౌడ సామాజికవర్గానికి చెందిన పొన్నం ప్రభాకర్, గతంలో కరీంనగర్ ఎంపీగా పని చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోటాలోనూ ఇద్దరికి మంత్రి పదవి ఉండనున్నది. దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌కు ఈ అవకాశం దక్కుతుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. వీరిద్దరికీ పదవులు వస్తే ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో భాగంగా ఉన్న జిల్లాలకు అదనంగా మంత్రి పదవులు దక్కినట్లే అవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి పదవి దక్కే నాయకుడి ఆధారంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎవరికి పదవులు దక్కుతాయనే విషయంలో స్పష్టత రానున్నది. పార్టీ, ఉమ్మడి వరంగల్ జిల్లా, సామాజిక సమీకరణ పరంగా పదవుల పందేరం ఉండనున్నది.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

# ప్రాణం ఉన్నంతవరకు ప్రజల పక్షాన నిలబడతా..

- రాజకీయాల్లో గెలుపోటములు సహజం
- కార్యకర్తలను కాపాడుకుంటా : మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

గిర్మాజీపేట, డిసెంబర్ 4 : రాజకీయాల్లోకి వచ్చిందే పేదల పక్షాన నిలబడటానికి.. నా ప్రాణం ఉన్నంత వరకు ప్రజల పక్షాన నిలబడతా.. అని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. సోమవారం ఆయన రాజశ్రీ గార్డెన్‌లో మాట్లాడుతూ.. ఓటమితో కుంగిపోమని, గెలుపుతో పొంగిపోమని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుని రెండు పర్యాయాలు రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగించిందన్నారు. తొలుత కార్పొరేటర్‌గా, తర్వాత ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తూర్పు నియోజకవర్గంలోని నిరుపేద కుటుంబాలకు ఇండ్ల పట్టాలు ఇవ్వడానికి కృషిచేశానన్నారు. ప్రజల నిర్ణయాన్ని శిరసావహిస్తూ అధికారంలో లేకపోయినా ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తానన్నారు. నాయకులు, కార్యకర్తలను కాపాడుకుంటానని తెలిపారు. ప్రభుత్వంలో ఉన్నవారు మంచి చేస్తే స్వాగతిస్తామని, ప్రజలకు హాని చేయాలని చూస్తే మేమంటే ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజనాల శ్రీహరి, కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్ల రవి, సురేశ్‌జోషి, బాబు, సిద్ధం రాజు, చింతాకుల అనిల్, నాయకులు మసూద్, పల్లం రవి, ముష్కమల్ల సుధాకర్, గందె నవీన్, దామోదర్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమికి రమేశ్‌బాబు, దుబ్బ శ్రీనివాస్, మనోహర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**ఉచిత కంప్యూటర్ శిక్షణ**
★ఉచిత కంప్యూటర్ శిక్షణ మరియు ఉచిత హాస్టల్. ఈ అవకాశం మొదటగా వచ్చిన 200 మంది Students కి మాత్రమే, Reg. కోసం సంప్ర: Softech Computers, GMR Complex, Kishanpura, HNK. 9246899300/302/304.
NTW-5802

**WANTED**
★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact....
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

## పలు రైళ్లు రద్దు

కాజీపేట, డిసెంబర్ 4 : బంగాళాఖాతంలో ఏర్పడిన మిచౌంగ్ తుఫాన్ కారణంగా కాజీపేట రైల్వే జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించే పలు ప్రయాణికుల రైళ్లను మంగళ, బుధవారం రద్దు చేశారు. మిచౌంగ్ తుఫాన్‌తో ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో సికింద్రాబాద్-గూడూరు మధ్య నడిచే (12710/12709) సింహపురి సూపర్‌ఫాస్ట్ రైలును 4, 5, 6 తేదీల్లో రద్దు చేశారు. చెన్నై- హైదరాబాద్ మధ్య నడిచే (12759) చార్మినార్ సూపర్‌ఫాస్ట్‌ను ఈ నెల 5న, తిరుపతి-సికింద్రాబాద్ మధ్య నడిచే (12763) పద్మావతిని 5వ తేదీన, సికింద్రాబాద్-తిరుపతి మధ్య నడిచే (12764) పద్మావతి సూపర్‌ఫాస్ట్ రైలు 5,6వ తేదీల్లో, ఆదిలాబాద్- తిరుపతి మధ్య నడిచే (17405/17406) కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలును 5, 6వ తేదీల్లో రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. అలాగే వరంగల్, చింతలపల్లి రైల్వేస్టేషన్‌ల్లో జరుగుతున్న మూడో లైన్ ఇంటర్ లాకింగ్, నాన్ ఇంటర్ లాకింగ్ పనుల వల్ల సికింద్రాబాద్-రాయపూర్ మధ్య నడిచే (12771) రైలును ఈ నెల 6, 8, 11, 13వ తేదీల్లో, రాయపూర్-సికింద్రాబాద్ మధ్య నడిచే (12772) రైలును 7, 9, 12, 14వ తేదీల్లో నాగపూర్ మీదుగా దారి మళ్లించనున్నట్లు తెలిపారు. రైళ్ల రద్దు, దారి మళ్లింపును ప్రయాణికులు గమనించాలని కోరారు.

# వేర్వేరు ప్రాంతాల్లో రెండు లారీలు బోల్తా

- డ్రైవర్ మృతి.. మరొకరికి గాయాలు

రాయపర్తి, డిసెంబర్ 4 : మండలంలోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై వేర్వేరు ప్రాంతాల్లో రెండు లారీలు అదుపు తప్పి బోల్తా పడ్డాయి. సోమవారం జరిగిన ఈ ఘటనల్లో ఒకరు మృతిచెందాడు. ఎస్సై దేశిని విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి లారీ ధాన్యం లోడ్‌తో నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని కీర్తి రైస్ ఇండస్ట్రీస్‌కు వెళ్తున్నది. మండల కేంద్రం శివారులోని కేసీఆర్ డబుల్ బెడ్ రూమ్‌ల కాలనీ వద్ద డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో లారీ అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ లారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. అలాగే మండలంలోని మైలారం గ్రామ శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చేపల లోడ్‌తో ఖమ్మం నుంచి వరంగల్‌కు వస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా కొట్టినట్లు డ్రైవర్ నిర్మల్, క్లీనర్ సతీశ్‌కుమార్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లా హనుమాన్ జంక్షన్ నుంచి చేపల లోడ్‌తో ఢిల్లీకి వెళ్తుండగా, లారీ అదుపు తప్పి బోల్తా పడినట్లు తెలిపారు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో ప్రమాదం జరిగినట్లు చెప్పారు.



రాయపర్తిలో బోల్తా పడిన ధాన్యం లారీ

## విద్యుత్‌షాక్‌తో బాలుడి మృతి..

ఎల్కతుర్తి, డిసెంబర్ 4 : మండలంలోని కేశవాపూర్ గ్రామానికి చెందిన సాత్విక్(10) విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందినట్లు ఎస్సై గోదారి రాజ్‌కుమార్ చెప్పారు. గ్రామానికి చెందిన చల్లా లాలాకర్‌కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు కాటారంలోని పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. కాగా, ఈ నెల 3న లాలాకర్ కుమారుడు సాత్విక్, చిన్న కూతురు అవంతిక బంధువుల బిల్డింగ్‌పైకి వెళ్లి ఆడుకుంటున్నారు. బిల్డింగ్ పైన ఉన్న పిల్లర్ ఐరన్ రాడ్‌కు విద్యుత్ సర్వీసు తీగ అనుకున్నది. ఆ సర్వీస్ తీగ పేలిపోయి ఉండడం, బాలుడు గమనించకుండా సలాకను ముట్టుకోవడంతో విద్యుత్‌షాక్ తగిలి కింద పడిపోయాడు. గమనించిన అవంతిక చుట్టుపక్కల వారికి చెప్పడంతో వారు అక్కడికి చేరుకొని సాత్విక్‌ను చికిత్స కోసం ఎంజీఎం దవాఖానకు తరలించారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ..

నల్లబెల్లి, డిసెంబర్ 4 : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం జరిగింది. రాంపూర్ గ్రామానికి చెందిన పురం మౌనిక (30) భర్త సారంగపాణి మద్యానికి బానిసై ఆమెను వేధించేవాడు. ఆదివారం రాత్రి సైతం మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడగా, మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఎస్సై నైనాల నగేశ్ను వివరణ కోరగా రాంపూర్‌లో మహిళ మృతి చెందిన విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

## హసన్‌పర్తిలో మతిస్థిమితం లేని మహిళ

హసన్‌పర్తి : మతిస్థిమితం లేని మహిళ మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని జయగిరికి చెందిన నీలం స్వరూప (53) కొన్ని ఏండ్ల నుంచి మానసిక వ్యాధితో బాధపడుతుండేది. ఆమెకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నది. ఇద్దరు కుమారులకు కూడా మతిస్థిమితం సరిగా లేదు. కాగా, కొద్ది రోజుల క్రితం పెద్ద కుమారుడు, రెండు సంవత్సరాల క్రితం భర్త గట్టయ్య మృతి చెందాడు. దీంతో ఆమె ఆలనాపాలనా చూసుకునే వారు ఎవరూ లేక పోవడంతో గ్రామంలో తిరుగుతూ జీవించేది. మూడు రోజుల క్రితం నుంచి గ్రామంలో కనబడటం లేదు. ఈ క్రమంలో గ్రామ శివారులోని ఓ గుట్ట సమీపంలో ఆమె మృతదేహాన్ని గమనించిన స్థానికులు బంధువులకు సమాచారం ఇచ్చారు. సోమవారం ఆమె మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహించారు.